

# పెండింగ్ బిల్లులు ఇప్పించాలి

**గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన సర్పంచ్‌ల సంఘం నాయకులు**



గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్, సంఘం నాయకులు

కడ్తాల్, జూన్ 30 : గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయించాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు కలిశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న జీపీ బిల్లుల విషయాలపై గవర్నర్‌కు వివరించినట్లు వారు తెలిపారు. 2019–24 మధ్య పదవీకాలంలో ఉన్న సర్పంచ్‌లు, అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ఆదేశాల మేరకు గ్రామాల్లో వైకుంఠధామం, వీధిలైట్ల నిర్వహణ, పల్లె ప్రకృతివనం, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, రైతు వేదిక, డంపింగ్‌యార్డు, మన ఊరు–మన బడి, మిషన్ భగీరథలాంటి అనేక అభివృద్ధి పనులు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టామని పేర్కొన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన జీపీలుగా తీర్చిదిద్దడంలో సర్పంచ్‌లు ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. గ్రామపంచాయతీ సిబ్బందితో మమేకమై పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, ఆరోగ్యవంతమైన గ్రామాలుగా మార్చినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వం నుంచి సరైన సమయానికి నిధులు రాకపోయినా.. గ్రామాలకు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌లు పదవిలో ఉన్నప్పుడుగానీ, గడువు ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా పెండింగ్‌లో ఉన్న బిల్లులు అందక, రాష్ట్రంలోని 12,769 సర్పంచ్‌లు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పారిశుధ్య కార్మికులకు జీతాలు అందకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైనట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు అందకపోవడంతో పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యమని గవర్నర్‌కు వివరించినట్లు వారు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించడానికి గవర్నర్ సానుకూలంగా స్పందించారని, బిల్లుల విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసినవారిలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సంఘం నాయకులు సుభాష్, లక్ష్మి, ప్రసన్నారెడ్డి, గణేశ్, రాజేందర్, రమేశ్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి సబితారెడ్డిని కలిసి సమావేశమైన మొయినాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు

# ఎవరూ అధైర్యపడొద్దు

- చేవెళ్ల బీఆర్ఎస్ శ్రేణులకు అండగా ఉంటా..
- సమన్వయంతో ముందుకు సాగి పార్టీ అభివృద్ధికి కృషి చేద్దాం
- తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష
- మాజీ సీఎం కేసీఆర్ మార్గ నిర్దేశం ప్రకారం కలిసి పనిచేద్దాం
- కాలె యాదయ్య పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కేమీ నష్టం లేదు
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి

మొయినాబాద్, జూన్ 30 : తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని .. నేతలందరూ పార్టీలు మారినా పెద్దఎత్తున బీఆర్ఎస్ సైన్యంతో పార్టీని మరింత బలోపేతం చేద్దామని.. ఎవరు కూడా అధైర్యపడొద్దని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితారెడ్డి నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆమె నాయకులు, కార్యకర్తలతో సమావేశమై వారికి మనోధైర్యం చెప్పి, దిశానిర్దేశం చేశారు. పార్టీలో చేరిన ఒక రోజు ముందే తమతో కలిసిమెలిసి ఉన్నాడని.. ఒక్క మాట కూడా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడం చాలా బాధాకరమని నేతలు, కార్యకర్తలు ఆవేదన వెల్లగక్కారు.

ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఎవరు పార్టీ మారినా బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని.. లక్షల మంది పార్టీ సైనికులున్నారని.. వారి బలంతో పార్టీని గతంలో కంటే మరింత బలోపేతం చేద్దామని చెప్పారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ మారినా చేవెళ్ల నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడి అనాలోచిత నిర్ణయాలు తీసుకుని రాజకీయ జీవితాన్ని ఆగం చేసుకోవద్దని సూచించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ప్రతీ కార్యకర్త ధైర్యంగా ఉండి పార్టీకి అండగా నిలిచినప్పుడే నిజమైన నాయకుడవుతాడన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పని చేసి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్దామని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని అన్నవాళ్లకు చెంపచెల్లు మనిపించేలా పార్టీని బలోపేతం చేద్దామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని, ఎవరు కూడా తొందరపాటు నిర్ణయాలు తీసుకుని పార్టీ మారితే వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంటుందని ఆమె హితవు పలికారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు పరమేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేశ్, సీనియర్ నాయకులు అంజయ్యగౌడ్, రాజు, తిరుపతిరెడ్డి, బాలమల్లేశ్, నవీన్‌కుమార్, భాస్కర్, ప్రవీణ్, అరవింద్, మహబూబ్, మహేందర్‌రెడ్డి, కుమార్, అలీమ్, శ్రీశైలం, రాములు, రవి పాల్గొన్నారు.



మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆదివారం తలకొండపల్లి జడ్పీటీసీ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో హరీశ్‌రావును వెంకటేశ్ సన్మానించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన తాజా రాజకీయ విషయాలను ఆయనతో చర్చించినట్లు తెలిపారు. - కడ్తాల్, జూన్ 30

# పింఛన్ పెంచేవరకూ పోరాడుతాం

**వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

యాచారం, జూన్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్ రూ.6వేలు పెంచేవరకు ప్రభుత్వంపై పోరాడుతామని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల భవనంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛన్ పెంచుతామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఫింఛన్ పెంచకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వానికి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.6వేలు పెంచాలన్నారు. రేవంత్ సర్కార్ పింఛన్‌లు పెంచేవరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. పింఛన్ పెంపు కోసం ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట వందలాది మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులతో ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఆందోళన కార్యక్రమానికి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు సలీం, జంగయ్య, రాములు, శ్రీనివాస్, దశరథ, మల్లేశ్, బ్రహ్మాచారి, ముస్తఫా, అత్తిరాం ఉన్నారు.



మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న మేనేజర్ కరుణాకర్‌రెడ్డి

# నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సంఘం అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

యాచారం, జూన్ 30 : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సంఘం పాలకవర్గ సమావేశాన్ని మేనేజర్ కరుణాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సంఘం నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన బందె మహేందర్‌రెడ్డి వరుసగా పదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా బైకనీ శ్రీనివాస్, దండె భాగ్యమ్మ, ఆలూరి మంగమ్మ, గొట్టె అంజయ్య, సంజీవ, నరసింహారెడ్డి, జంగయ్యలను ఎన్నుకున్నారు. పాల ఉత్పత్తిదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు.

# తాళాలు వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా..


- ఐదిండ్లలో చోరీ
- 15 తులాల బంగారం, రూ.1.20లక్షల నగదు దొంగతనం



ఓ ఇంట్లో వస్తువులు, దుస్తులను చిందరవందర చేసిన దొంగలు

పరిగి, జూన్ 30 : తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు ఐదిండ్లలో చొరబడి చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రిని వారు దొంగతనానికి ఎంచుకున్నారు. అద్దెకు ఉండేవారు శనివారం స్వగ్రామాలకు, ఇతర చోట్లకు వెళ్తారని గుర్తించి తాళాలు వేసి ఉన్న ఇండ్లను ఎంచుకొని దొంగతనానికి పాల్పడ్డారు. పరిగిలోని వెంకటేశ్వర కాలనీ, టీచర్స్‌కాలనీల్లోని ఐదిండ్ల తాళాలు విరగ్గొట్టి సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20లక్షల నగదు దొంగిలించారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, టీచర్స్‌కాలనీలోని బంద్యానాయక్, సాయిరాం, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆనంద్‌రావు ఇండ్లల్లో చోరీ జరిగింది. బంద్యానాయక్ ఇంట్లో 12 తులాల బంగారం, రూ.1.20లక్షల నగదు, శ్రీకాంత్ ఇంట్లో 3 తులాల 3 మాసాలు బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మిగతా ఇండ్లలో కొంత మొత్తంలో నగదు దొంగిలించారు. ఇండ్ల తాళాలు విరగ్గొట్టిన దొంగలు ఆయా ఇండ్లల్లో సామగ్రి, దుస్తులు చిందరవందరగా పారవేశారు. ఆదివారం తెల్లవారుజామున ఈ వరుస చోరీలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడి తిరిగి వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల కదలికలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

# రైతు బంధుపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య

కులకచర్ల, జూన్ 30 : రైతు బంధుపై రైతుల అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు డీసీవో ఈశ్వరయ్య, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య తెలిపారు. ఆదివారం కులకచర్లలోని రైతు వేదికలో రైతు బంధుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో రైతు అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కాగా రైతుల అభిప్రాయాలు సేకరించగా.. కొంతమంది రైతులు పూర్తి స్థాయిలో రైతు బంధును అందించాలనగా.. కొంతమంది రైతులు 10 ఎకరాల వరకు రైతు బంధును ఇవ్వాలని తెలిపారు. బంజరు, గ్రామ కంఠం, రియల్ భూములకు రైతు బంధును నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, ఎంపీటీసీ ఆనందం, పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీన్ జోన్‌ను రెసిడెన్షియల్ జోన్‌గా మార్పిస్తా..

**మాజీ మంత్రి ఎమ్మెల్యే, సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట, జూన్ 30 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లో ఉన్న గ్రీన్ జోన్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అల్మాస్‌గూడలోని 24వ డివిజన్‌లో ఉన్న విశాఖనగర్, శ్రీసాయి హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ఎస్ఆర్ హిల్స్, ఏఆర్ఎసీఆర్ కాలనీ అసోసియేషన్ నాయకులు గ్రీన్ జోన్ నుంచి తమ కాలనీలను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని 24వ డివిజన్ కార్పొరేటర్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నం.122, 123, 124, 129లలో ఉన్న గ్రీన్ జోన్ ఎత్తివేస్తే కాలనీవాసులు ప్రశాంతంగా ఉంటారన్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు రాక ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్ జోన్ పరిధి ఉందన్నారు. అల్మాస్‌గూడలోనే ఆరు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి అనుమతులివ్వకపోవడంతో బ్యాంకర్లు లోన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ బ్యాంక్‌ల నుంచి లోన్ తీసుకుంటే నెలకు అదనంగా 11వేలు చెల్లించాల్సి వస్తున్నదని తెలిపారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేయించే బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. బడంగ్‌పేట, అల్మాస్‌గూడలో ఉన్న ఈ సమస్యను అవసరమైతే సీఎం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీవాసులెవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాలనీల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. గ్రీన్ జోన్ పరిధిలో కొత్తగా చాలా కాలనీలు వెలిశాయన్నారు. ఇండ్ల నిర్మాణం చేసుకున్న వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# అప్‌గ్రేడ్ అయినా అందని సేవలు

- పట్నం దవాఖానలో మందుల కొరత
- ఆదివారం రోగులకు అందని వైద్యం
- కుక్కకాటుకు టీఈటీ మందు కరువు
- డాక్టర్ వృత్తిని నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు

ఇబ్రహీంపట్నం, జూన్ 30 : పట్నంలో కేంద్ర బిందువుగా ఉన్న ప్రభుత్వ దవాఖాన పనితీరు అధ్వానంగా మారుతున్నది. వైద్య విధాన పరిషత్‌కు అప్‌గ్రేడ్ అయినా దవాఖాన తీరు మాత్రం మారడంలేదు. దవాఖానలో మందుల కొరత రోగులను వేధిస్తున్నది. ఆదివారం వచ్చిందంటే చాలు వైద్యులు అందుబాటులో ఉండటంలేదు. దీంతో స్టాఫ్ నర్సులే డాక్టర్ పాత్రను పోషిస్తున్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందటంలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి రోజూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

### వైద్య సేవలు అంతంత మాత్రమే..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రానికి దవాఖాన అప్‌గ్రేడ్ అయినా వైద్య సేవలు అంతంత మాత్రమే. పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మారినా వైద్యుల తీరు మాత్రం మారడంలేదు. ఔట్ పేషంట్లకు సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని కోరుతున్నారు.

### ఎమర్జెన్సీ కేసులుంటే నగరానికే..

ఆదివారం వచ్చిందంటే చాలు రోగులకు సరైన వైద్యం అందడంలేదు. సెలవుదినం రోజున వైద్యులు రాకపోవడంతో స్టాఫ్ నర్సులే డాక్టర్ సేవలను అందిస్తున్నారు. దీంతో మెరుగైన వైద్యం అందడంలేదు. ఎమర్జెన్సీ కేసులుంటే నగరంలోని ప్రైవేట్ దవాఖాన, ఉస్మానియా దవాఖానకు రెఫర్ చేస్తున్నట్లు వాపోతున్నారు. ఆదివారం సైతం వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు అన్ని రకాల వైద్య సేవలను స్థానికంగా అందించాలని కోరుతున్నారు.






విధులు నిర్వహిస్తున్న నర్స్

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే..

పట్నం ప్రభుత్వ దవాఖానలో కుక్కకాటు టీఈటీ మందు కరువైంది. ఆదివారం 10 మంది కుక్కకాటుకు గురై దవాఖానను ఆశ్రయించారు. వైద్యులు లేకపోవడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. టీఈటీ ఇంజక్షన్ లేకపోవడంతో రోగులు ప్రైవేటులో కొనుగోలు చేసి ఇంజక్షన్ వేయించుకున్నట్లు వాపోయారు. వైద్య విధాన పరిషత్ దవాఖానలో మందులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే దవాఖాన తీరు అధ్వానంగా మారుతున్నదని స్థానికులు పేర్కొంటున్నారు.

**మెరుగైన వైద్యం అందించేందుకు కృషి**

రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆదివారం స్టాఫ్ నర్సులకు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలిస్తూ రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నాం. దవాఖాన సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం.

- రాధిక, సూపరింటెండెంట్, ఇబ్రహీంపట్నం

# కురిసిన వర్షం.. రైతుల హర్షం

- పంటలకు జీవం పోసిన వాన
- రోడ్లు, లోతట్టు కాలనీలన్నీ జలమయం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- మురుగునీటితో కంపుకంపు
- తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజల వినతి

బొంరాస్‌పేట, జూన్ 30 : మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. చాలా రోజుల తరువాత వర్షం కురువడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వానకాలం సీజన్‌లో రైతులు వేసిన విత్తనాలు మొలకెత్తిన తరువాత చాలా రోజుల నుంచి వర్షం జాడ లేదు. దీంతో మొలకెత్తిన మొలకలు ఎండలకు వాడుముఖం పడుతున్నాయి. ఈ దశలో వర్షం కురువడంతో పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

### వికారాబాద్‌లో..

**వికారాబాద్ :** ఆదివారం సాయంత్రం వికారాబాద్‌లో దాదాపు 2 గంటల పాటు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆదివారం సంత ఉండటంతో కురిసిన వర్షానికి సంతకు వచ్చిన రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. కూరగాయల మార్కెట్ వద్ద కూరగాయలు అమ్ముకునేందుకు కూర్చున్న రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. కురిసిన వర్షానికి కూరగాయలు అమ్మే రైతులు తడిసి ముద్దయ్యారు. అస్సాం బేకరీ వద్ద వరద నీటిలో మురుగునీరు రోడ్లపై పారింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మురుగునీరు రోడ్లపై పారకుండా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వికారాబాద్ : కూరగాయలు అమ్ముతూ వర్షానికి తడుస్తున్న రైతులు



వికారాబాద్ : అస్సాం బేకరీ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగునీరు

### తాండూరు నియోజకవర్గంలో..

**తాండూరు :** తాండూరు నియోజకవర్గంలో ఆదివారం కురిసిన భారీ వర్షంతో కాగ్నానదితో పాటు వాగులు, చెక్‌డ్యాంలు వరద నీటితో నిండాయి. తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల పరిధుల్లోని పలు వాగులు పొంగిపొర్లే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పట్టణంలోని లోతట్టు కాలనీల రోడ్లు నీటితో మునిగాయి. ఆదర్శ తులసీనగర్, భద్రేశ్వర్ చౌక్‌లో నీళ్లు నిండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నీళ్లు నిలవకుండా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టారు. మరో వైపు భారీ వర్షాలతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు.



తాండూరు: ఆదర్శ తులసీనగర్‌లో వరద నీటితో మునిగిన రోడ్డు

### పరిగి మండలంలో..

**పరిగి :** పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమై రాత్రి వరకు కురిసింది. దీంతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తాండూరు: శాంతినగర్‌లో వర్షపు నీటిలో ఇరుక్కుపోయిన స్కూటీ



తాండూరు: ఇండ్లలోకి చేరిన నీరు